సంపుటి :02 సంచిక :220 పేజీలు :05 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people



## నిజాయితీతో విధులు నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ సత్యశారద

04

మంగళవారం 28, అక్టోబర్ 2025

థ్రిల్లర్ సినిమాను మించిన సస్పెన్స్

# ఎస్సై అల్లిన కథ ఇదీ!



పోలీస్ డిపార్ట్‌మెంట్ చరిత్రలోనే ఇది అతిపెద్ద కేసు. రూ. 3 వేల కోట్ల భారీ ఆర్థిక నేరం.. ప్రజల సొమ్ము ను కాజేసి ఊహకందని దోపిడీకి పాల్పడిన సూత్రధారి.. అంత కాజేసి సొమ్ము ముంబైకి చెక్కేశాడు. అతడి అలికిడిపై ఉప్పందుకున్న హైదరాబాద్ పోలీస్‌శాఖ పక్కాగా వలపన్నింది. ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఇక అంతా సజావుగా సాగుతుందని భావించిన తరుణంలో బృందంలోని ఒక ఎస్సై ట్విస్ట్ ఇచ్చాడు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకుని హైదరాబాద్‌కి తిరిగొచ్చే మార్గంలో అతడితో డీల్ కుదుర్చుకున్నాడు. సినిమాటిక్ స్టైల్‌లో సహచర పోలీసుల్ని పక్కకు తప్పించి, పక్కా ప్లాన్‌తో నిందితుడు పరారయ్యేందుకు అవకాశం కల్పించాడు. ఉన్నతాధికారులకు మాత్రం నిందితుడు పారిపోయాడనే కట్టుకథ అల్లి, ఉన్నతాధికారుల కళ్లుగప్పాలని చూశాడు. సస్పెన్స్ థ్రిల్లర్‌ను తలపించే ఈ వార్త ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నది. ఈ కథకు హైదరాబాద్ పోలీస్‌శాఖ ఎలాంటి ముగింపునిస్తుందో వేచి చూడాల్సిందే.

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

- ఇదే.. ఇప్పుడు తెలంగాణలో హాట్ న్యూస్
- రూ.3 వేల కోట్ల ఆర్థిక నేరగాడి వేట
- పక్కదారి పట్టిన ప్రత్యేక ఆపరేషన్
- రూ.2 కోట్లకు డీల్ కుదుర్చుకున్న ఎస్సై
- పక్కా ప్లాన్‌తో వదిలేసి.. ఉన్నతాధికారులకు కట్టుకథ
- ఎస్సైపై డిపార్ట్‌మెంటల్ విచారణ షురూ

02



# మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ

- డీజీపీ సమక్షంలో లొంగిపోయిన బండి ప్రకాష్, పుల్లూరి ప్రసాదరావు
- అనారోగ్య కారణాలే కారణమని సమాచారం

04

ఇద్దరు మావోయిస్టు కీలక నేతలు సరెండర్

## మాజీ మంత్రి హరీశ్‌రావుకు పితృవియోగం

సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు (95) వయోభార సమస్యలతో సతమతమవుతూ కన్నుమూశారు. హైదరాబాద్‌లోని క్రిన్స్‌విల్లాస్‌లో ఆయన పార్థివదేహాన్ని ఉంచారు. ఫిల్మ్‌నగర్‌లోని మహాప్రస్థానంలో మంగళవారం మధ్యాహ్నం అంత్యక్రియలు జరిగాయి. సత్యనారాయణ మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించారు. సత్యనారాయణతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. హరీశ్‌రావును, కుటుంబ సభ్యులను ఓదార్చారు. _అక్షరదర్బార్, హైదరాబాద్

02



## 7330751364

### ధాన్యం కొనుగోళ్లలో సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్

04

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ప్రారంభం



# మాజీ మంత్రి హరీశ్ రావుకు పితృవియోగం

అక్షరదర్బార్, హైదరాబాద్: సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు (95) అనారోగ్యంతో కన్నుమూశారు. హైదరాబాద్‌లోని క్రిన్స్ విల్లాస్‌లో ఆయన పార్థివదేహాన్ని ఉంచారు. ఫిల్మ్ నగర్‌లోని మహాప్రస్థానంలో మంగళవారం మధ్యాహ్నం అంత్యక్రియలు జరిగాయి. సత్యనారాయణ మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, తీవ్ర సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించారు. సత్యనారాయణతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. హరీశ్‌రావును, కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధిత



కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం ప్రకటించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేశారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం సంతాపం వ్యక్తం చేశారు.









# ఎస్సై అల్లిన కథ ఇది!

- థ్రిల్లర్ సినిమాను మించిన సస్పెన్స్
- ఇదే.. ఇప్పుడు తెలంగాణలో హాట్ న్యూస్
- రూ.3 వేల కోట్ల ఆర్థిక నేరగాడి వేట
- పక్కదారి పట్టిన ప్రత్యేక ఆపరేషన్
- రూ.2 కోట్లకు డీల్ కుదుర్చుకున్న ఎస్సై
- పక్కా ప్లాన్తో వదిలేసి.. ఉన్నతాధికారులకు కట్టుకథ
- ఎస్సైపై విచారణ షురూ

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: ఒకటి కాదు.. రెండు కాదు.. రూ.3 వేల కోట్ల విలువైన ఆర్థిక నేరానికి పాల్పడిన నిందితుడు. ముంబైలో అజ్ఞాత వాసం గడుపుతున్న నిందితుడి కోసం పక్కా ప్లాన్తో తెలంగాణ పోలీస్ అక్కడికి పోలీసుల బృందాన్ని పంపించింది. డబ్బుకు ఆశపడిన ఒక ఎస్సై భారీ మొత్తంలో సొమ్ము తీసుకుని నిందితుడిని వదిలిపెట్టాడనే వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ వదంతులు ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనమయ్యాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. హైదరాబాద్ పోలీస్ శాఖ కొన్నాళ్లుగా ఒక ఘరానా మోసగాడిని వెతికే పనిలో పడ్డాయి. నిందితుడు పెట్టుబడుల పేరుతో ప్రజలను మోసగించి వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు నిందితుడు రూ.3 వేల కోట్ల విలువైన ఆర్థిక నేరానికి పాల్పడ్డాడని తెలిసింది. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉండి ముంబైలో తలదాచుకుంటున్నాడని పోలీస్ ఉన్నతాధికారులు సమాచారం అందుకున్నారు. దీంతో ప్రత్యేక బృందాలతో ఒక ఆపరేషన్ చేపట్టాలనుకున్నారు. పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఆదేశాల మేరకు, నిందితుడిని పట్టుకునేందుకు ఒక ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందం ముంబైకి వెళ్లింది.

## - కట్టుకథ ఇలా..

వాహనం ఆపిన సమయంలో నిందితుడు తప్పించుకు పారిపోయాడని ఎస్సై తన పైఅధికారులకు వివరిం చాడు. అయితే, అంతమంది పోలీసులు కాపలా ఉన్నా నిందితుడు తప్పించుకోవడంపై ఉన్నతాధికారులకు అనుమానం వచ్చి డిపార్ట్ మెంటల్ విచారణకు ఆదేశించారు. విచారణలో, ఎస్ఐ డబ్బు తీసుకుని నిందితుడిని వదిలేసినట్టు ప్రాథమికంగా నిర్ధారణ అయినట్లు సమాచారం. సదరు ఎస్సైపై గతంలోనే అక్రమాల ఆరోపణలు ఉన్నట్లు విచారణలో తేలినట్లు తెలిసింది. ఈ మొత్తం వ్యవహారం పోలీస్ శాఖలో ప్రస్తుతం చర్చనీయాంశమైంది. అయితే.. రూ.3 వేల కోట్ల నేరానికి పాల్పడిన నిందితుడు ఎవరు, లంచం తీసుకున్న ఎస్సై ఎవరు..? అనే విషయాలపై పోలీస్ ఉన్నతాధికారుల నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఈ విషయం అధికారికంగా బయటకు వస్తే, పోలీస్ శాఖపై మాయని మచ్చ పడనున్నదని విశ్లేషకులు భావిస్తున్నారు.

## - తెలివిగా డీల్..

సీపీ ముంబైకి పంపించిన ప్రత్యేక బృందంలో 2020 బ్యాచ్‌కు చెందిన ఒక ఎస్ఐ కూడా ఉన్నాడు. ఈయన నిందితుడిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే, నిందితుడిని అరెస్టు చేసి హైదరాబాద్‌కు తిరిగి తీసుకొచ్చే మార్గంలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. సదరు ఎస్ఐ, నిందితుడితో రూ. 2 కోట్ల డీల్ కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. డీల్ అమలు కోసం సినిమా స్టైల్‌లో ఒక మాస్టర్ ప్లాన్ అమలు చేశాడు. ఇతర పోలీసు బృందాన్ని వేరే వాహనంలో సుమారు 30 కిలోమీటర్ల దూరం ఉండేలా ముందు పంపించి, తాను మాత్రం నిందితుడితో మరొక వాహనంలో ప్రయాణించాడు. మార్గమధ్యంలో ఒక హోటల్ వద్దకు నిందితుడి అనుచరులను పిలిపించుకుని, రూ.2 కోట్ల నగదు తీసుకున్నాడు. ఆ తర్వాత ఒప్పందం ప్రకారం నిందితుడిని వదిలిపెట్టాడు. డబ్బు తీసుకుని నిందితుడిని వదిలేసిన తర్వాత, ఆ ఎస్సై ఉన్నతాధికారులను నమ్మించేందుకు ఒక కట్టుకథ అల్లినట్లు తెలిసింది.



# డిసెంబర్ 9 లోగా పీఆర్సీ ప్రకటించాలి

- లేకుంటే దశలవారీ పోరాటం తప్పదు
- పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిక్షం గౌడ్

అక్షర దర్బార్ , మహబూబాబాద్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, డిసెంబర్ 9వ తేదీలోగా పీఆర్సీ ప్రకటించాలని పీఆర్టీయూ (ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే, డిసెంబర్ 9 తర్వాత దశలవారీ పోరాటాలతో ఉద్యోగుల శక్తి ఏమిటో చూపిస్తామని ఆయన హెచ్చరించారు. పీఆర్టీయూ పుట్టిన మానుకోట గడ్డపై మొట్టమొదటిసారిగా అడుగుపెట్టిన సందర్భంగా, మహబూబాబాద్ జిల్లా సర్వసభ్య సమావేశానికి విచ్చేసిన భిక్షం గౌడ్‌ను మండల అధ్యక్షులు భూక్య రామోజీ నాయక్ సహా నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భిక్షం గౌడ్ మాట్లాడుతూ... సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ ప్రవేశపెట్టాలని, 2011 కన్నా ముందు చేరిన వారికి టెట్ విధానం రద్దు చేయాలని, ఉపాధ్యాయ పర్యవేక్షణ కమిటీలను రద్దు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



రక్తదానం చేస్తున్న పరకాల సీఐ క్రాంతి కుమార్

# పోలీస్ అమర వీరుల త్యాగాలు వృథా కావు

### పరకాల సీఐ క్రాంతి కుమార్

అక్షర దర్బార్, పరకాల: పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవాలను పురస్కరించుకొని పరకాల డివిజన్ పరిధిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పరకాల సీఐ క్రాంతి కుమార్, రూరల్ సీఐ రంజిత్ రావు ఆధ్వర్యంలో, రెడ్ క్రాస్ రక్తనిధి సహకారంతో పరకాల డి పి ఆర్ గార్డెన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ రక్తదాన శిబిరంలో పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక యువత, ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. 105 యూనిట్ల రక్తాన్ని ఈ శిబిరంలో సేకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పరకాల సీఐ క్రాంతి కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో



ఎస్సైలు విఠల్, రమేష్, పవన్, కొంక అశోక్ (దామెర), పరమేశ్వర్ (శాయంపేట), పోలీస్ సిబ్బంది, రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్లు మదన్మోహన్, కిషన్ రావు, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాయర్ కంపెనీ నూతన ఉత్పాదన

# కెమాలస్ క్షేత్ర ప్రదర్శన



అక్షర దర్బార్, పరకాల: పరకాల మండలం లోని నర్సక్కపల్లి గ్రామా రైతు ఇంగే రవీందర్ మిరప తోటలో బాయర్ కంపెనీ నూతన ఉత్పాదన కెమాలస్ అర ఎకరాకు స్ప్రే చేయించారు. అనంతరం వాడిన 8 రోజుల తరువాత క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. రైతులను నేరుగా కెమాలస్ వాడిన పొలాన్ని వాడని పొలాన్ని పరిశీలించి ,కెమాలస్ వాడిన పొలం లో ఆకు తినే పురుగు మరియు రసం పీల్చే పురుగులు లేకుండా నివారణ అయ్యి ఆకు ముడుత లేకుండా కొత్త చిగురు రావడం గమనించారు. కెమాలస్ వాడిన పొలాన్ని చూసి వచ్చిన 120 మంది రైతులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కంపెనీ సి. సి. ఎం. శివేష్ రెడ్డి, ప్రతినిధులు మండల కిరణ్, పీల్లెల శివసాయి, ఎంబాడి పరమేష్, మార్కెట్ డెవలప్మెంట్ టీం సంతోషిని, సాయికృష్ణ, రమణారెడ్డిలు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు టీకాలు



అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండలం నూర్జహాన్ పల్లి గ్రామంలో పశువులకు స్థానిక పశువైద్యాధికారి సునిల్ మరియు ప్రజ్వాల్ సంస్థ సంయుక్తంగా గ్రామంలోని 150 తెల్లజాతి పశువులకు 40 నల్ల జాతి పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేశారు.ఈ సందర్భంగా ప్రజ్వాల్ సంస్థ గ్రామ కార్యకర్త తరాల తిరుపతి మాట్లాడుతూ మూగజీవాలు వాటి బాధలను చెప్పలేవని ముందుగానే రైతులు నివారణకు టీకాలు వేయించి మూగజీవాలను రక్షించుకోవాలని రైతులు ఆర్థికంగా నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రవి రమేష్ బాబు, సదానందం, నవయుగ సొసైటి డైరెక్టర్ అల్లే రాజీరు, శ్రీపతి రామకోటి, చెల్పూరి రామచంద్ర , కుమారస్వామి , అనిల్, గోపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.





# షీటీం సేవలను వినియోగించుకోవాలి

### షీ టీం సబ్ ఇన్ స్పెక్టర్ మౌనిక

అక్షరదర్బార్, వెంకటాపూర్: మహిళలు, విద్యార్థినులను ఆకతాయిలు వేధిస్తే వెంటనే షీ టీం పోలీసులకు సమాచారం ఇవ్వాలని షీ టీం సబ్ ఇన్స్పెక్టర్ మౌనిక కోరారు. వెంకటాపూర్ మండలం పాలంపేట జిల్లాపరిషత్ సెకండరీ స్కూల్ విద్యార్థులకు డయల్ 100, సైబర్ క్రైమ్, టీసేవ్ యాప్ తో పాటు షీ టీం సేవలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. వేధింపులు ఎదురైతే 87125 76528కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మహిళ కానిస్టేబుల్ చైతన్య, నవ్య, యశోద, ఆలేఖ్య పాల్గొన్నారు.

# ఎంజీఎం సూపరింటెండెంట్ గా హరీష్ చంద్రారెడ్డి

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ సూపరింటెండెంట్గా డాక్టర్ హరీశ్ చంద్రారెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొద్ది రోజుల క్రితం ఎంజీఎం ఆసుపత్రిలో రోగులు ఇబ్బందులు పడుతున్న విషయాలపై మీడియాలో వరుస కథనాలు రాగా ప్రభుత్వం సీరియస్ గా ఎంజీఎం ఆసుపత్రి నిర్వహణపై దృష్టి సారించింది. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం ఒకే ఆక్సిజన్ సిలిండర్ ను ఇద్దరు బాలురకు అమర్చిన విషయం మరోసారి ఎంజీఎం ఆసుపత్రిలో నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేసింది. తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ పై చర్యలు తీసుకుని ఆయన స్థానంలో కొత్తగా హరీష్ చంద్రారెడ్డిని నియమించింది.

# దళారులను నమ్మొద్దు

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- రామకృష్ణాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలం రామకృష్ణాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని పౌర సరఫరాల శాఖ, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రైతులు దళారులను నమ్మకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఎమ్మెల్యే సూచించారు. ధాన్యం ఏ గ్రేడ్కు రూ.2389, కామన్ రకానికి రూ.2369 మద్దతు ధరగా, అలాగే సన్న రకానికి రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ధాన్యంలో 17% మాయిశ్చర్ స్థాయిని పాటించాలని సూచించారు.

# ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

### బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కు మెమోరాండం అందజేత



అక్షర దర్బార్ శాయంపేట : కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల ఎన్నికల హామీలను అధికారంలోకి వచ్చి దాదాపుగా రెండేళ్లు గడిచినప్పటికీ అమలు చేయకపోవడానికి నిరసనగా బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో శాయంపేట చౌరస్తా నుండి తహసీల్దార్ కార్యాలయానికి నాయకులు ర్యాలీగా వెళ్లారు. అనంతరం తహసీల్దార్ కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలతోపాటు 420 దొంగ హామీలను నెరవేరుస్తానని చెప్పిన కాంగ్రెస్ ఇప్పటివరకు ఏ ఒక్క గ్యారెంటీని అమలు చేయలేదని అన్నారు. కాంగ్రెస్ పరిపాలన ఇదే విధంగా కొనసాగితే రానున్న రోజులలో ప్రజలు కచ్చితంగా కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్తారని అన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పు రాజు, సీనియర్ జిల్లా నాయకులు బాసని విద్యాసాగర్, వనం దేవరాజ్, కోడెపాక సంజీవరావు, మాజీ మండల అధ్యక్షుడు గడ్డం రమేష్, జిల్లా యువ మోర్చా కార్యదర్శి లడే శివ, ప్రధాన కార్యదర్శి భూతం తిరుపతి, మామిడి విజయ్ మండల ఉపాధ్యక్షుడు కోమటి రాజశేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ రాకేష్ రెడ్డి,భూత్ అధ్యక్షులు మునుకుంట్ల చంద్రమౌళి, పున్నం సాంబయ్య, కన్నెబోయిన రమేష్, మంద మధు, చెక్క దినేష్, ఎర్ర తిరుపతిరెడ్డి,గొలుసు రాజు పాల్గొన్నారు.




# రైల్వే స్టేషన్ లో డ్రగ్స్ కంట్రోల్ టీమ్ తనిఖీలు

అక్షరదర్బార్, వరంగల్: మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా వరంగల్ రైల్వే స్టేషన్లో డ్రగ్స్ కంట్రోల్ టీమ్ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. జాగిలాల సహాయంతో అనుమానిత వ్యక్తులు, వారి బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇన్స్పెక్టర్ సతీశ్ సూచించారు. ఈ తనిఖీల్లో ఆర్ఐ శివ కేశవులు, ఆర్ఎస్ఐలు పూర్ణ, మనోజ్, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



# మహా రుద్రయాగానికి అంకురార్పణ

అక్షర దర్బార్, పరకాల: పరకాల టౌన్కి చెందిన ప్రముఖ శైవ క్షేత్రం శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా మహా రుద్రయాగం ఆధ్యాత్మిక వైభవంగా ప్రారంభమైంది. సోమవారం ఉదయం 11 గంటల 5 నిమిషాలకు బీజావాపనం, సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ కార్యక్రమం భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ కోమల్లపల్లి సంపత్కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంలో ఆలయ కమిటీ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, తోటా రవి, మహా రుద్రయాగ సమితి అధ్యక్షులు ఎర్ర లక్ష్మణ్, కన్వీనర్ గందె రవి, కో-కన్వీనర్ ఆముదాల పెల్లి అశోక్, కోశాధికారి తోట భద్రయ్య, సమితి సభ్యులు, ఆలయ కమిటీ డైరెక్టర్లు మరియు అనేక మంది భక్తులు పాల్గొన్నారు. భక్తజనసందోహంతో ఆలయ ప్రాంగణం భక్తి, ఆధ్యాత్మికత నిండిన వాతావరణం నెలకొంది.

# విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి విద్యార్థులకు స్కూల్ కాంప్లెక్స్ రాయపర్తి ప్రధానోపాధ్యాయులు నూతి వేణుగోపాలస్వామి స్టడీ మెటీరియల్ ను అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల స్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కంచ రాజు కుమార్, పుల్లూరి రామకృష్ణ, శరత్ గౌడ్ పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ల కోసం
# కంట్రోల్ రూమ్
## హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ప్రారంభం

అక్షరదర్బార్, హనుమకొండ: వరి ధాన్యం కొనుగోళ్లలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ధాన్యం కొనుగోలులో ఎదురయ్యే సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణకు ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం మిల్లుకు చేరేవరకు పర్యవేక్షణపై ఫిర్యాదుల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు, లారీలు, గోనె సంచులు, కొనుగోళ్ల ప్రక్రియ మానిటరింగ్, తదితర సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ నెంబరు 7330751364 ను సంప్రదించవచ్చునని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్థిక అభివృద్ధికి కృషి

- రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- ఎమ్మెల్యే జీఎస్సార్ తో కలిసి చెరువులో చేప పిల్లల విడుదల

అక్షరదర్బార్, గణపురం: మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. గణపురం రిజర్వాయర్‌లో 14.50 లక్షల చేప పిల్లలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి వదిలారు. మత్స్య సంపద అభివృద్ధికి ₹123 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. యువత క్రీడల వైపు మళ్లాలని సూచించి, జిల్లాలో క్రీడా మైదానాల నిర్మాణానికి ₹5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర చెరువులో చేప పిల్లల పోసే కార్యక్రమంలో గతంలో అవినీతి జరిగిందని, ఈసారి పారదర్శకంగా చేపట్టినట్లు తెలిపారు. మత్స్యకారుల కోసం ₹50 లక్షలతో కళ్యాణ మండపం నిర్మాణానికి మంత్రి అంగీకరించారు.

# పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



అక్షరదర్బార్, ఆత్మకూరు: హనుమకొండ జిల్లా గూడెప్పాడ్ వద్ద ఉన్న ఆత్మకూరు మండలం పెద్దాపూర్ కు సంబంధించిన మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 8, 9, 10వ తరగతుల విద్యార్థినులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. వారి విద్యా ప్రగతిని, పాఠశాల వసతులను గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. గురుకుల పాఠశాలలోని కిచెన్ షెడ్ ను పరిశీలించి వంట నిర్వాహకులతో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆత్మకూరు తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ

- ఇద్దరు మావోయిస్టు కీలక నేతలు సరెండర్
- డీజీపీ సమక్షంలో లొంగిపోయిన బండి ప్రకాష్, పుల్లూరి ప్రసాదరావు
- లొంగుబాటుకు అనారోగ్యమే కారణం



అక్షరదర్బార్, హైదరాబాద్: మావోయిస్ట్ పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. పార్టీ కీలక నేత, సికాస కార్యదర్శి బండి ప్రకాశ్ అలియాస్ ప్రభాత్ మంగళవారం హైదరాబాద్‌లో డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. అనారోగ్య కారణాలతో ఆయన లొంగిపోయారని తెలుస్తోంది. ఇవాళో రేపో తెలంగాణ పోలీస్‌శాఖ ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించనున్నదని సమాచారం. ప్రకాశ్ పార్టీలో 45 ఏళ్లు వివిధ స్థాయిల్లో పనిచేశారు. ఆయన స్వస్థలం మంచిర్యాల జిల్లా మందమర్రి. ప్రకాశ్ తండ్రి సింగరేణి కార్మికుడు. చదువుతున్న రోజుల్లోనే రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్‌ఎస్ యూ) తరఫున విప్లవోద్యమం లోకి అడుగుపెట్టాడు. 1982– 84 మధ్య గ్రామాలకు తరలి వెళ్లండి అనే పీపుల్స్‌వార్ పిలుపునకు ఆకర్షితుడయ్యాడు. మావోయిస్ట్ పార్టీ అనుబంధ సంస్థ సింగరేణి కార్మిక సంఘం అధ్యక్షుడిగా కొన్నేళ్లు పనిచేశాడు. తర్వాత పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎదిగాడు. 1988లో బెల్లంపల్లిలో సీపీఐ నేత అబ్రహం హత్య కేసులో ఆయన జైలుకు వెళ్లాడు. ఆదిలాబాద్ సబ్ జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో నాటి పీపుల్స్‌వార్ ముఖ్య నేతలైన నల్లా ఆదిరెడ్డి, మహమ్మద్ హస్సేన్, ముంజ రత్నయ్య గౌడ్ తదితరులతో కలిసి సబ్ జైలు గోడలు బద్దలుకొట్టాడు. అంతేకాదు.. పోలీసుల తుపాకులతో సహా చాకచక్యంగా తప్పించుకున్నాడు. తర్వాత 1991లో మళ్లీ అరెస్ట్ అయిన బండి ప్రకాశ్ 2004లో విడుదలయ్యాడు. సీఎం రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంతో జరిపిన శాంతి చర్చల సమయంలో ఆయన జన జీవనస్రవంతిలోనే ఉన్నారు. కానీ, ప్రభుత్వంతో మావోయిస్టు పార్టీ చర్చలు విఫలం కావడంతో మళ్లీ అడవి బాట పట్టారు. 20 ఏళ్లుగా తెలంగాణ రాష్ట్ర కమిటీలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తూ తాజాగా పోలీసుల ఎదుట లొంగిపోయాడు. పోలీసుల ఎదుట లొంగిపోయిన వారిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, తెలంగాణ ఇంఛార్జి పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న అలియాస్ సోమన్న కూడా ఉన్నట్లు తెలిసింది. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం వడ్కాపూర్ గ్రామానికి చెందిన పుల్లూరి ప్రసాదరావు పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహించారు.

# నిజాయితీతో విధులు నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ సత్యశారద**




అక్షరదర్బార్, వరంగల్: ప్రభుత్వ ఉద్యోగులకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా సమగ్రత, అవినీతి నిర్మూలన, లంచం ఇవ్వచూపడం, తీసుకోవడం నేరం వంటి అంశాలపై అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి నవంబరు 2వ తేదీ వరకు విజిలెన్స్ మనందరి బాధ్యత అనే థీమ్‌తో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులకు విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ పై అవగాహన కల్పించడం, అటవీ శాఖ సహకారంతో విజిలెన్స్ అంశంపై విరివిగా మొక్కలు నాటడం, పబ్లిక్ సెక్టార్ , బ్యాంకుల్లో నైతిక పద్ధతులు, పారదర్శకతను ప్రోత్సహించడం, ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, విజిలెన్స్ ఉద్యోగులు, విద్యార్థులతో వాకథాన్, ప్రభుత్వ కార్యాలయాల్లో పబ్లిక్‌లో అవినీతి నిర్మూలనపై విద్యార్థులచే క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమగ్రత, పారదర్శకతను ప్రోత్సహించడంలో ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులను పాల్గొనేలా చేయడం, అవినీతి అవకాశాలను తగ్గించడానికి వ్యవస్థలు, ప్రక్రియలను బలోపేతం చేయడం, అవినీతి రహిత సమాజం కోసం అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.

దేశ సమగ్రత, చేసే పనుల్లో పారదర్శకత, జవాబుదారీతనం, సంక్షేమ పథకాలను ప్రజలకందించి వాటి అమలు సక్రమంగా అమలయ్యేలా చూడడం, వాటిపై మరింత దృష్టి సారించాలన్నారు. ప్రతి ఒక్కరూ విధుల్లో బాధ్యతాయుతంగా పనిచేయాలని, అవినీతికి అవకాశం ఇవ్వరాదన్నారు.

ఎక్కడ అవినీతి ఉంటుందో ఆ వ్యవస్థకే వేరు కుళ్లు సోకిన విధంగా ప్రమాదం సంభవించే అవకాశం ఉందన్నారు. అందుకు అవకాశం ఇవ్వకుండా నీతి నిజాయితీతో విధులు నిర్వహించాలన్నారు.

విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ ద్వారా రూపొందించిన పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ ఓ విజయలక్ష్మి, విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ ప్రాంతీయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



# రాజ్యాంగ సవరణతోనే బీసీలకు రిజర్వేషన్లు

- బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా వైస్ చైర్మన్ బోనగాని యాదగిరి గౌడ్
- బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ తో భేటీ

అక్షరదర్బార్, హనుమకొండ: దేశంలో సగభాగానికి పైగా ఉన్న బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని, సామాజిక న్యాయం జరగాలంటే అది రాజ్యాంగ సవరణతోనే సాధ్యమని బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా వైస్ చైర్మన్ బోనగాని యాదగిరి గౌడ్ అన్నారు. మంగళవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, బీసీ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ను గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా వైస్ చైర్మన్ బోనగాని యాదగిరి గౌడ్ తో పాటు గోపా హన్మకొండ జిల్లా అధ్యక్షుడు చిర్ర రాజు గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు రరేష్ గౌడ్, బీసీ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మనిమంజరి, బీసీ మహిళా సంఘం నాయకులు పోశాల పద్మ గౌడ్ లు హైద్రాబాద్ లోని బీసీ సంక్షేమ సంఘం కేంద్ర కార్యాలయంలో ఆయనతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా బీసీ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ గా నియమితులైన జాజుల శ్రీనివాస్ గౌడ్ ను ఘనంగా సత్కరించారు. అనంతరం బోనగాని యాదగిరి గౌడ్ మాట్లాడారు. బీసీలలో 136 కులాలున్నాయని, దేశ సంపదను సృష్టించే బీసీ కులస్తులు.. దేశ సంపదలో వాటాను పంచుకోలేకపోతున్నారన్నారు. దేశ సంపదను 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులస్తులు సృష్టిస్తే.. కేవలం 10 శాతం ఉన్న అగ్రవర్ణాల వారు ఆ సంపదను దోచుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణం చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు లేకపోవడమేనన్నారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు దక్కాలంటే రాజ్యాంగ సవరణ జరగాలన్నారు. పది శాతం ఉన్న అగ్రవర్ణాలు దేశాన్ని శాసిస్తుంటే.. దేశ సంపదను సృష్టించేవారు బానిసలుగా బతకాల్సిన అవసరం లేదన్నారు. అందుకే మేమెంతో మాకంత వాటా అంటూ బీసీ సోదరులంతా రిజర్వేషన్ల సాధనకై పోరుబాట పట్టాల్సిన అవసరం ఉందన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915